విద్యార్థులకు పౌష్టికాహారంగా రాగిజావ

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- పాఠశాలల్లో రాగిజావ పంపిణీ ప్రారంభం



అమలాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే పాఠశాలల్లో పూర్తి పరిపుష్టితో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తోందని, తాజాగా చేర్చిన రాగి జావతో విద్యార్థులకు అదనంగా పౌష్టికాహారం అందుతుందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. అమలాపురం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీని మంత్రి విశ్వరూప్ మంగళవారం ప్రారంభించారు. రాష్ట్రంలో గత తెలుగు దేశం ప్రభుత్వం మధ్యాహ్నం భోజన పథకం అమలుకు కేవలం రూ.485 కోట్లు వెచ్చిస్తే ఇప్పుడు జగన్ ప్రభుత్వం రూ.1,900 కోట్లు వెచ్చిస్తోందని మంత్రి విశ్వరూప్ చెప్పారు. విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం వెచ్చిస్తున్న వసతులను వివరిస్తూనే గత ప్రభుత్వంలో మధ్యాహ్న భోజన పథకం ఎంత పేలవంగా ఉండేదో తేడాను తెలియజేశారు. ముఖ్యమంత్రి జగన్ ఎన్ని కోట్లైనా ఖర్చు చేసేందుకు వెనకడాడడం లేదని స్పష్టం చేశారు. తొలుత మంత్రి విశ్వరూప్ పాఠశాలలో అప్పటికే తయారైన మధ్యాన్న భోజనాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామగోపాల్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర పాల్గొన్నారు.

అమలాపురం టౌన్: స్థానిక నారాయణపేటలోని లాల్ బహదూర్ శాస్త్రి మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యుడు జక్కంపూడి కిరణ్ ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైరపర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, పాఠశాల హెచ్‌ఎం బీవీఎస్‌సీ పోలిశెట్టి తదితరులు పాల్గొన్నారు.

అల్లవరం: అల్లవరం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీడీఓ సరోవరరావులు విద్యార్థులకు రాగిజావ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారానికి మూడు సార్లు అందించే రాగి జావని విద్యార్థులు తాగాలని సూచించారు. బోడసకుర్రు హైస్కూల్లో రాగిజావ పంపిణీని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ప్రారంభించారు.

ఐ.పోలవరం: కొమరిగిరి జెడ్పీ పాఠశాలలో రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీపీ మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్పీటీసీ ముదునూరి సతీష్ రాజు తదితరులు ప్రారంభించారు.

ముమ్మిడివరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాగి జావ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ కుడుపూడి శంకరరావు, నగర పంచాయతీ కమిషనర్ జి.లోవరాజు, తహసీల్దార్ యడ్ల రాంబాబు, ఎంపీడీఓ నాగశ్రీనివాస్, ఎంఈఓ బొజ్జా రమణశ్రీ తదితరులు అట్టహాసంగా ప్రారంభించారు.

ఉప్పలగుప్తం: భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు ఎస్.సత్యకృష్ణ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ గెద్దం సంపదరరావు రాగి జావ పంపిణీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో కె.కిరణ్ బాబు మాట్లాడుతూ రాగిజావలో ఉన్న పోషకాలు విద్యార్థుల ఆరోగ్యానికి మేలు చేస్తాయన్నారు.

తాళ్లరేవు: తాళ్లరేవు శ్రీమతి నామన వెంకాయమ్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాగిజావ పంపిణీ కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి శామ్యూల్ సాగర్‌తో కలిసి ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. రాగిజావ తాగడం ద్వారా విద్యార్థుల్లో రక్తహీనత సమస్య తొలగిపోతుందని చెప్పారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కు అందజేత



బాధిత కుటుంబసభ్యులకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ తదితరులు

ముమ్మిడివరం: ఇటీవల ముమ్మిడివరం 13వ వార్డుకు చెందిన కోటుం సంపదరావు గుండెపోటుతో మృతి చెందాడు. సంపదరావు కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.5 లక్షలు మంజూరైంది. ఆ చెక్కును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ మంగళవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఎమ్మెల్యే వెంట నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్‌కుమార్, పెన్మత్స చిట్టిరాజు, కోలా బాబ్జీ, వేటుకూరి బోసురాజు, రెడ్డి శివన్నారాయణ తదితరులున్నారు.

ప్రొటోకాల్ అంశంపై అసెంబ్లీలో ప్రస్తావన

యానాం: యానాం నియోజకవర్గ పరిధిలో కొంతమంది అధికారులు ప్రభుత్వ ఉత్తర్వులను పరిగణనలోకి తీసుకోకుండా తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన పుదుచ్చేరి అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రొటోకాల్ సమస్యపై తక్షణం చర్యలు తీసుకోవాలని స్పీకర్ సెల్వంను కోరారు. యానాం జీజీహెచ్‌లో డయాలిసిస్ యూనిట్ ఏర్పాటుచేయాలని అసెంబ్లీలో సీఎం రంగసామి దృష్టికి తీసుకెళ్లారు. స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా యానాం మాస్టర్‌ప్లాన్ త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

జీజీహెచ్‌లో వైద్యసేవలు మెరుగుపరచాలి

యానాం: యానాం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందించే వైద్యసేవలు మెరుగు పరచాలని కోరుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ దళిత్ రైట్స్ ప్రొటక్షన్ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మెల్లం శ్రీనివాసరావు ఆర్‌ఏఓ మునిస్వామికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఒక్కో స్పెషలిస్ట్ వైద్యునికి రూ.లక్ష వరకు వేతనం లభిస్తున్నా, వైద్యులు మాత్రం ప్రభుత్వ ఆసుపత్రిలో ఉండకుండా ప్రైవేట్ క్లినిక్‌లకే ప్రాధాన్యమిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కొంతమంది జీజీహెచ్ డ్రైవర్లు, ఒక స్ట్రెక్చర్ బోయ్ తదితరులు జీజీహెచ్ చెంతనే ప్రైవేట్ క్లినిక్‌లు నడుపుతున్నారని స్థానికులు చర్చించుకుంటున్నారని ఆరోపించారు. వీటిపై తక్షణం విచారణ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవికుమార్, చినబాబు, వెంకన్న, భీమారావు పాల్గొన్నారు.

నేలకొరిగిన దశాబ్దాల నాటి ధ్వజ స్తంభం



మునిపల్లి శివాలయంపై విరిగిపడిన ధ్వజ స్తంభం

ఉప్పలగుప్తం: మండలంలోని మునిపల్లి గ్రామంలో ఉన్న పార్వతీ సమేత మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఏడు దశాబ్దాల క్రితం నిర్మించిన టేకు ధ్వజ స్తంభం మంగళవారం విరిగి ఆలయ మండపంపై పడింది. ఆ సమయంలో అక్కడ భక్తులెవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఈ ధ్వజ స్తంభాన్ని మహాదశ రత్తమ్మ అనే భక్తురాలు 1954లో ఏర్పాటు చేశారు.

తుమ్మలపల్లిలో పట్టపగలే చోరీ

అల్లవరం: అల్లవరం మండలం తుమ్మలపల్లి సచివాలయానికి కూతవేటు దూరంలో మంగళవారం మధ్యాహ్నం పట్టపగలే చోరీ జరిగింది. గ్యాస్ సిలెండర్లు సప్లయ్ చేసే కందేరి రవికి చెందిన తాటాకిల్లు వెనుక భాగంలోని తలుపులు పగులగొట్టి ఇంట్లోకి చొరబడి బీరువాలోని 8 గ్రాముల బంగారం, వెండి పట్టీలు, మొలతాడు, రూ.50 వేలు నగదు, మొబైల్ చోరీ చేశారు. ఇంట్లో ఎవరూ లేని సమయం చూసి దొంగతనానికి పాల్పడ్డారు. రవి ఫిర్యాదుతో ఎస్ఐ శ్రీనునాయక్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వైభవంగా సుబ్బాలమ్మ జాతర

అమలాపురం టౌన్: పట్టణ దేవత సుబ్బాలమ్మ అమ్మవారి జాతర, తీర్థ మహోత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారి గ్రామోత్సవం, గరగ నృత్యం వైభవంగా నిర్వహించారు. స్థానిక దేవాంగులవీధిలోని సుబ్బాలమ్మ ఆలయాన్ని మామిడి, వేప, పూల తోరణాలతో అలంకరించారు. ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకూ రోజూ అమ్మవారికి ప్రత్యేక పూజలు, 27న ఏకాహం, 28న అన్న సమారాధన ఏర్పాటుచేసినట్లు ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ఆలయ ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావులు తెలిపారు.

నేడు పంచాంగ శ్రవణం

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శోభకృత నామ నూతన సంవత్సరం పురస్కరించుకొని యానాంకు చెందిన నాగాభట్ల వీర వెంకట సుబ్రహ్మణ్య శర్మచే పంచాంగ శ్రవణం ఏర్పాటు చేసినట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

పంచాంగం ఆవిష్కరణ

అమలాపురం రూరల్: బండారులంకకు చెందిన సిద్ధాంతి కాలేపు భీమేశ్వరరావు రచించిన ఈశ్వర గంటల పంచాంగాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

అల్లవరం: సమస్త ప్రాణికోటికి జీవనాధారమైన నీటిని పొదుపుగా వాడుకోవాలని, వర్షపు నీటిని ఒడిసి పట్టి రేపటి తరానికి అందించాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గోడిలంకలో మంచినీటిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గౌతమి, వైస్ ఎంపీపీ వడ్డి గంగ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల సమస్యలు పరిష్కరించాలి

అమలాపురం టౌన్: జిల్లాలోని వక్ఫ్ బోర్డు భూములకు సంబంధించి నెలకొన్న సమస్యల పరిష్కారానికి రాష్ట్ర బోర్డు నుంచి సహకారం అందించాలని జిల్లా బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్ రాష్ట్ర అధికారులకు మంగళవారం వినతి పత్రాలు అందించారు. విజయవాడలోని రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయంలో స్టేట్ బోర్డు ప్రత్యేక అధికారి షిరీన్ బేగం, సెర్ప్ సీఈవో ఇంతియాజ్ మహ్మద్‌లను వేర్వేరుగా కలిసి వినతి పత్రాలు అందించారు.

కుప్పకూలిన విద్యుత్ స్తంభాలు

తాళ్లరేవు: ఉపరితలద్రోణి ప్రభావంతో మంగళవారం వీచిన ఈదురుగాలులకు గాడిమొగ పంచాయతీ చినవలసల గ్రామంలో నాలుగు విద్యుత్ స్తంభాలు, ఒక చెట్టు కుప్పకూలాయి. అయితే ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని అంతా ఊపిరి పీల్చుకున్నారు.

కాలువల్లో పూడికతీత పనుల పరిశీలన

అల్లవరం: అల్లవరం ప్రధాన కాలువ వద్ద జరుగుతున్న గుర్రపు డెక్క తొలగింపు పనులను ఎంపీడీఓ సరోవరరావు మంగళవారం పరిశీలించారు. అనంతరం ఉపాధి కూలీల మస్తర్లను చెక్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామాల్లోని మేజర్, మైనర్ కాలువల్లో గుర్రపు డెక్క, తూటు తొలగింపు పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు

అమలాపురం టౌన్: విజయవాడ భవానీపురం పోలీస్‌స్టేషన్‌లో ఓ న్యాయవాదికి అన్యాయం జరిగిందని ఆరోపిస్తూ అమలాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మాకిరెడ్డి ఆదినారాయణ ఆధ్వర్యంలో సుమారు 100 మంది న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి నిరసన తెలిపారు.

అక్రమ విద్యుత్ మోటార్లు తొలగించండి

అల్లవరం: జాంబావానిపేటలో పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా కావడం లేదంటూ ఇటీవల స్పందనలో గ్రామస్తులు ఫిర్యాదుపై చేశారు. దీంతో ఎంపీడీఓ జి.సరోవరావు మంగళవారం జాంబావానిపేట వెళ్లి స్థానికులతో మాట్లాడారు. జాంబావానిపేటకు వచ్చే ప్రధాన పైపులైన్‌కి అక్రమ విద్యుత్ మోటార్లు ఏర్పాటు చేసి నీటిని తోడేయడం వల్లే తాగునీరు రావడం లేదని అధికారులకు స్థానికులు వివరించారు. వెంటనే అక్రమ విద్యుత్ మోటార్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని కార్యదర్శి కేవీవీ సత్యనారాయణను ఎంపీడీఓ ఆదేశించారు.